క్లుప్తంగా

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటీ వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని ముష్టపల్లి గ్రామంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, వ్యక్తిగత శుభ్రతతోపాటు ఇంటి పరిసరాను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలన్నారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

'మనస్విని' ప్రారంభం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

బండి ఆత్మకూరు: మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మనస్విని కార్యక్రమాన్ని శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఎస్‌ఐ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాను సరఫరా చేయాలి



ఏఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కొత్తపల్లి: రైతన్నలకు అవసరమైంత యూరియాను సరఫరా చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాలరాజు శనివారం ఏఓ అమిరున్నీసా బేగంకు వినతి పత్రం అందించారు. వర్షాలు కురుస్తుండటంతో మొక్కజొన్న, వరి పైర్లకు యూరియా అవసరమని, అధికారులు స్పందించి కావాల్సిన యూరియాను రైతులకు సమకూర్చాలని వారు డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, రవీంద్రారెడ్డి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

జూపాడుబంగ్లా: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను శనివారం జంగాలపేట ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. అలాగే మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ రమేష్‌ను, ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై చెన్నైకు చెందిన సరళకుమారి వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మహాగణపతిం, శివానందలహరి, నటరాజ శబ్దం, శివపంచాక్షరి, శివ తాండవ స్తోత్రం తదితర గీతాలకు భవాని, నేత్ర, నక్షత్ర, చంద్ర, శివాని, రుద్ర, మాధురి, వినాయకి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

మహిళ హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

నందికొట్కూరు: ఓ మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఈనెల 4న పగిడ్యాల మండలం ఎం.ఘనపురం గ్రామానికి చెందిన సుగాలి నాగమ్మ హత్యకు గురైంది. తండ్రి చంద్ర నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో సాయంత్రం 4.30 గంటల సమయంలో ఈస్ట్ ప్రాతకోట కాటమయ్య స్వామి గుడి వద్ద అనుమానాస్పదంగా ఉన్న మృతుని మరిది లోక్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. రైతుపల్లికి చెందిన ఓ వ్యక్తితో తన వదిన అక్రమ సంబంధం పెట్టుకుందని, పలుమార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోపోవడంతోనే హత్య చేశానని నిందితుడు అంగీకరించినట్లు సీఐ తెలిపారు.

యూరియా కోసం పడిగాపులు

కూటమి ప్రభుత్వంలో అన్నదాతలను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో పైర్లకు యూరియా తప్పని సరి కావడంతో దళారీలు కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటుండటంతో రైతులకు సకాలంలో ఎరువులు అందడం లేదు. గంటల కొద్దీ సొసైటీల వద్ద వేచి ఉన్నా.. పొలం పాసు పుస్తకానికి ఒకటి, రెండు బస్తాలు ఇచ్చి పంపుతుండటంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు రూ.150 అదనంగా వసూలు చేసి నానో యూరియాను అంటగడుతుండటంతో ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

- తెల్లవారుజాము నుంచే సొసైటీలకు క్యూకడుతున్న రైతులు
- గంటల తరబడి వేచి ఉన్నా ఇచ్చేది ఒకటి లేదా రెండు బస్తాలే..



రైతులకు టోకన్లు జారీ చేస్తున్న రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది

పగిడ్యాల: మండలంలోని పగిడ్యాల, లక్ష్మాపురం పీఏసీఎస్‌లకు 35.91 మెట్రిక్ టన్నుల యూరియ రావడంతో రైతులు శనివారం తెల్లవారుజాము నుంచే పాస్ బుక్ జిరాక్స్ కాపీలను క్యూలో పెట్టి పడిగాపులు కాశారు. ఉదయం 10 గంటలకు వచ్చిన వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాస్ బుక్ జిరాక్స్ కాపీలను చెక్ చేసి టోకన్లు జారీ చేసి పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీని ప్రారంభించారు. కాగా పాస్ పుస్తకాలు ఎవరి పేరుతో ఉన్నాయో వారే వచ్చి బయోమెట్రిక్ థంబ్ వేయాలని వ్యవసాయ అధికారులు మెలిక పెట్టడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువగా పొలాల పాస్ పుస్తకాలు మహిళల పేర్లపైనా, వృద్ధుల పేర్లపైనా చేయించుకున్నారు. వారిని తీసుకురావాలంటే మళ్లీ గ్రామాలకు వెళ్లి అక్కడి నుంచి పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేస్తున్న మహిళలను, మంచానికే పరిమితమైన వృద్ధులను ఎలా తీసుకురావాలంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వ్యవసాయాధికారులు దిగొచ్చి.. పుస్తకానికి రెండు, మూడు బస్తాలు ఇచ్చి పంపారు.



తిమ్మాపురంలో ఎండలోనే నిరీక్షిస్తున్న రైతులు

- **మహానంది:** మండలంలోని తిమ్మాపురం, అబ్బీపురం, బొల్లవరం గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు 59.94 టన్నుల యూరియా పంపిణీ చేశారు. పోలీసు బందోబస్తు మధ్య పాసుపుస్తకానికి రెండు బస్తాల చొప్పున రైతులకు అందజేశారు. తిమ్మాపురంలో తహసీల్దార్ రమాదేవి, ఏఓ నాగేశ్వరరెడ్డిలు హాజరు కాగా ఏఎస్‌ఐ మౌలాలి, కానిస్టేబుళ్ల ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాలు అందజేశారు. ఇదిలా ఉండగా యూరియా బస్తాపై ఎమ్మార్పీ రూ.266.50 ఉండగా రూ.270 తీసుకున్నారు. రైతులే బస్తాలు మోసుకుంటున్నా తిమ్మాపురంలో హమాలీ ఖర్చు పేరుతో బస్తాకు రూ.5 అదనంగా తీసుకున్నారని రైతులు వాపోయారు. ఇదే విషయాన్ని ఏఓ నాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన.. తీసుకోవద్దని సిబ్బందిని ఆదేశించారు.



యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

వెలుగోడులో..

వెలుగోడు: మండలంలో అధికారులు చేపట్టిన యూరియా పంపిణీ కార్యక్రమం గందరగోళానికి దారితీస్తోంది. రోజంతా క్యూలో నిలబడినా ఒక్క బస్తా యూరియా దొరకడం గగనమైంది. శనివారం మోతుకూరు రైతు సేవా కేంద్రం, వెలుగోడు శ్రీనివాస ఆగ్రో కెమికల్స్, ధనలక్ష్మి ఫర్టిలైజర్స్, సాయి లక్ష్మి ఎరువుల దుకాణాల వద్ద, గుంతకందాల, రేగడగూడూరు రైతు సేవా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేపట్టారు. మోతుకూరులో ఒక్కో పాస్ పుస్తకానికి మధ్యాహ్నం వరకు రెండు బస్తాలు ఇచ్చిన అధికారులు.. ఆ తరువాత ఒక్క బస్తా మాత్రమే ఇచ్చి పంపారు. మిగిలిన చోట్ల కూడా ఒక బస్తా మాత్రమే యూరియా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వెలుగోడు రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం స్టాక్ అయిపోయిందని చెప్పిన అధికారులు..శనివారం 80 బస్తాల యూరియాను ఇతర ప్రాంతాలకు తరలించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎరువుల బ్లాక్‌మార్కెట్‌పై 9న అన్నదాత పోరు

- పోస్టర్లు ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శిల్పా చక్రపాణిరెడ్డి, నాయకులు

మహానంది/బండిఆత్మకూరు: ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలుతుంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు చోద్యం చూస్తూ రైతులను ముంచుతున్నారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల పద్మావతి నగర్‌లోని శ్రీశైలం నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ యూరియాతో పాటు రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ఉచిత పంటల బీమా పునరుద్దరించి అందరికీ వర్తింప చేయాలన్నారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, మహానంది, బండిఆత్మకూరు మండలాల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా మధుసూదన్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ ఏవీ కృష్ణారెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు రాజంరెడ్డి సుజాతమ్మ, వికలాంగు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు దాసరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి రూ.3లక్షల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న గౌరు జనార్దన్ రెడ్డి

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామ సమీపంలో ఉన్న సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల మోటార్ల మరమ్మతులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి రూ.3లక్షల ఆర్థిక సాయం అందించారని నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి అన్నారు. సిద్ధార్థరెడ్డి చేసిన ఆర్థిక సాయాన్ని శనివారం రైతు కమిటీ సభ్యులకు గౌరు జనార్దన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సంగమేశ్వరం ఎత్తిపోతల పథకం మరమ్మతుల విషయాన్ని సిద్ధార్థరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రైతుల మేలు కోరి ఆర్థిక సాయం చేశారన్నారు. మరో రూ.4 లక్షలు రైతు కమిటీల నుంచి వసూలయ్యాయని ఈ మొత్తంతో ఎత్తిపోతల పథకం మోటార్లకు మరమ్మతులు చేయించి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. కాగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు కమిటీ సభ్యులు కె.మధుసూదనరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గౌరు రామసుబ్బా రెడ్డి, తెలుగు హుస్సేనయ్య, తెలుగు వెంకటేశ్వరులు, శీలం ప్రకాష్‌రావు, శీలం వేదమూర్తి, మాజీ సర్పంచ్ వీరయ్య, డీలర్ బక్కన పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో అక్రమాలకు తావివ్వొద్దు



యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

జూపాడుబంగ్లా: యూరియా పంపిణీలో అక్రమాలకు తావు ఇవ్వొద్దని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి వీఏఏ, వీహెచ్ఏలకు సూచించారు. శనివారం తాటిపాడు, మండ్లెం, తంగడంచ, 80బన్నూరు, పారుమంచాల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియాను పంపిణీ చేశారు. 80 బన్నూరు, తాటిపాడు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ ప్రక్రియను తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఏడీఏ గిరీష్, ఏఓ కృష్ణారెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునతో కలిసి ఆర్డీఓ నాగజ్యోతి పరిశీలించారు. గతంలో సరఫరా చేసిన రైతులకు కాకుండా మిగతా రైతులకు అందజేయాలని ఆమె సిబ్బందికి సూచించారు. వీరి వెంట డీటీ నాగన్న ఉన్నారు.

వంద లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి రాముడు

నందికొట్కూరు: నాటుసారా తయారీకి దూరంగా ఉండాలని అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి రాముడు అన్నారు. శనివారం పట్టణంలోని నీలిషికారిపేటలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అమరావతి అనే మహిళ వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జయరామ్ నాయుడు, స్థానిక ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు నాయక్, ఎస్‌ఐలు శ్రీనివాసులు, జబ్రుల్లా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వెలుగోడు: స్థానిక పెట్రోల్ బంక్ వద్ద శనివారం ఎస్‌ఐ సురేష్ వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆర్‌సీ, లైసెన్స్‌లను పరిశీలించారు. అతి వేగంతో ప్రమాదాలకు గురి కావద్దని వాహనదారులకు సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.

నేడు మహానందీశ్వర ఆలయం మూసివేత

మహానంది: సంపూర్ణ రాహు గ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మహానంది ఆలయ తలుపులు మూసేయనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరిగి సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, సంప్రోక్షణ, ప్రాతఃకాల పూజల అనంతరం ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం కొనసాగుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు మాట్లాడుతూ 80బన్నూరులో శ్మశానవాటికకు స్థలం ఏర్పాటు, భాస్కరాపురంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం, పారుమంచాలలో ఇళ్ల మధ్యనున్న శ్మశానవాటిక తొలగింపు, కొత్తసిద్ధేశ్వరంలోని చెంచులకు జూపాడుబంగ్లాలో ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించటం తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోవడం తగదన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఎస్‌ఐ మల్లికార్జున సీపీఐ నాయకులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. అనంతరం వినతిపత్రాన్ని స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ధర్నాలో పార్టీ నాయకులు మగ్బుల్‌బాషా, పుల్లన్న, నాగన్న, మనోహర్, రమణ, రాజు, అంజి, బాలమసి, రాజు, పోలమ్మ పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

నందికొట్కూరు: రోడ్డుప్రమాదంలో గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ కోలుకోలేక శనివారం మృతిచెందింది. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాలు.. ఈనెల 4న జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామానికి చెందిన రామలింగన్న గౌడ్, లక్ష్మీదేవి(60) దంపతులు పని నిమిత్తం బైక్‌పై కర్నూలు వెళ్లారు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో బ్రాహ్మణకొట్కూరు సమీపంలో బైక్‌పై నుంచి లక్ష్మీదేవి కిందపడింది. 108లో కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఆమె కుమారుడు రవీంద్రగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1975-76 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. రూ.1.20 లక్షలు ఖర్చు చేసి రేకులతో నిర్మించిన కళా వేదికను పూర్వ గురువు ఫణిరావు ప్రారంభించారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామిరెడ్డి, హెచ్ఎం ముజుహిద్‌పాషా, ఉపాధ్యాయురాలు ప్రమీలరాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి



వాట్సాప్ గవర్నెన్స్ గురించి వివరిస్తున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

వెలుగోడు: ఇంట్లోనే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు డబ్బాలలో ఉంచి పారిశుధ్య కార్మికులకు అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డంపింగ్ యార్డులో చెత్త రీసైక్లింగ్, కాలుష్యం వల్ల భవిష్యత్‌లో సంభవించే పరిణామాలపై గ్రీన్ అంబాసిడర్లకు శనివారం అవగాహన కల్పించారు. మోతుకూరు, బోయరేవుల గ్రామాల్లో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఐదు రోజులు తడి చెత్త, 2 రోజులు పొడిచెత్తను తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలని, ప్రతి ఇంట్లో మహిళలకు చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి రైతుకు యూరియా అందజేయాలి



యూరియా సరఫరాపై ప్రశ్నిస్తున్న మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: ప్రతి రైతుకు యూరియా అందజేయాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు ముందుగా తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఏఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో యూరియా కొరతలేదనడంతో మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి కల్పించుకుని రైతులకు యూరియా ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు. పలుకుబడి ఉన్న వారికి మాత్రమే యూరియా ఇస్తున్నారని సన్న, చిన్నకారు రైతులకు యూరియా ఇవ్వటం లేదని ఆరోపించారు. వృద్ధులు, వికలాంగులు, 60 ఏళ్ల పైబడిన వారికి డీలర్లు ఇళ్ల వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం లేదని ఎంపీపీ సువర్ణమ్మ సభ దృష్టికి తీసుకురాగా తహసీల్దార్ చంద్రశేఖర్ స్పందిస్తూ నిబంధనల ప్రకారం 60 ఏళ్ల పైబడిన వారందరికీ ఇళ్ల వద్దకు సరుకులు అందేలా చూస్తామని అన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు మార్చి నెలాఖరులోగా నిర్మించుకోకపోతే రద్దవుతాయని హౌసింగ్ ఏఈ జ్యోతి తెలిపారు.



శ్రీశైలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం

వైభవంగా గణేష్ నిమజ్జనం

శ్రీశైలంటెంపుల్: వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం శ్రీశైలంలో వైభవంగా నిర్వహించారు. కొత్తపేట, ఎస్టీ హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో, సీఆర్‌వో కార్యాలయం, స్టాఫ్ క్వాటర్స్, వర్క్‌షాప్, లంబాడీ కాలనీ, శ్రీగిరి కాలనీ, అన్నదానం, సిద్ధి రామప్ప వాణిజ్య సముదాయం, లలితా బజార్, మార్కెట్ షాపులు, కల్యాణకట్ట, గేట్ నెం.2 ఎదురుగా, ఘంటామఠం తదితర ప్రదేశాల్లో నెలకొల్పిన గణపయ్యలకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజల అనంతరం లడ్డూ వేలాలు నిర్వహించారు. ఎస్టీ హాస్టల్ గణేష్ లడ్డూను రౌతు అశోక్ రూ.3.33 లక్షలకు, సీఆర్‌వో కార్యాలయం గణేష్ లడ్డూను రూ.3 లక్షలకు నవీన్ దక్కించుకున్నారు. అనంతరం డప్పు వాయిద్యాలతో అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జన ర్యాలీ నిర్వహించారు. లింగాలగట్టు వద్ద పాతాళగంగలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమెరికా టారిఫ్‌ల పెంపును వ్యతిరేకించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రణధీర్

ఆత్మకూరు: అమెరికా టారిఫ్‌ల పెంపును వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు రణధీర్, మాబాషా, రజాక్, బైరాపురం మహబూబ్ బాషా తెలిపారు. ట్రంప్ నిర్ణయాలను నిరసిస్తూ పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఎగుమతులపై సుంకం పెంచి, మరోవైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతులు చేసుకోవాలని, రష్యా నుంచి ఆయిల్‌ను కొనుగోలు చేయరాదని ట్రంప్ ఆదేశించడం తగదన్నారు. ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు ముసలిమడుగు రసూల్, మోమిన్, యూసుఫ్, రాజమత్ ఇబ్రహీం, రామ్‌నాయక్, నాగేశ్వరరావు, వీరన్న, రమణ, గణపతి, సామేల్ తదితరులు పాల్గొన్నారు.